వెలిగిన కార్తీక దీపం

- వర్షంలోనూ పోటెత్తిన భక్తులు
- సాధువుల సందడి





వేలూరు/ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రమైన తిరువణ్ణామలై కార్తీక శోభతో ప్రకాశిస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటలకు 2,666 అడుగుల ఎత్తయిన శిఖరంపై వెలిగిన మహాదీపాన్ని లక్షలాదిమంది భక్తులు దర్శించి పరవశించిపోయారు. అన్నామలైయార్ సమేత ఉన్నామలై అమ్మవార్లకు శివాచార్యులు మహాదీపారాధన నిర్వహించిన సమయంలో భక్తుల 'శివ నామస్మరణ'లతో అరుణాచలేశ్వరం మార్మోగింది. తిరువణ్ణామలై కొండపై మహాదీపం వెలిగించడంతో, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర శివాలయాల్లో కూడా కార్తీక దీపాలు వెలిగించి లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే భక్తులు తమ ఇళ్లలో ప్రమిదలు వెలిగించారు. ఈ ఆలయంలో గత నెల 24వ తేదీ ధ్వజారోహణంతో పది రోజుల కార్తిక దీపోత్సవాలు ప్రారంభమయ్యాయి. కాగా, భారీ వర్షం కారణంగా మహా దీపం వెలిగించే సమయంలో భక్తులను కొండ శిఖరంపైకి అనుమతించలేదు.

40 లక్షల మందికి పైగా ...

కార్తీక దీపోత్సవం సందర్భంగా అరుణాచలేశ్వరాలయం, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలు, తోరణాలు, పూలతో అలంకరించారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శివాచార్యులు బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు భరణి దీపం వెలిగించారు. పంచభూతాలను గుర్తుచేసే విధంగా పంచ దీపాలు వెలిగించిన భరణి దీపాన్ని ఒక్కొక్క సన్నిధికి తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, చండికేశ్వరుడు, అన్నామలైయార్, పరాశక్తి, 63 మంది నయన్మార్ల మూర్తులను పల్లకీల్లో ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. కొండ శిఖరంపైకి తరలించిన 4,500 కిలోల నెయ్యి, 5,500 మీటర్ల నూలు దారంతో తయారు చేసిన వొత్తుకి ప్రత్యేక పూజలు నిర్వహించిన శివాచార్యులు సాయంత్రం 6 గంటలకు మహాదీపం వెలిగించారు. 5 అడుగుల ఎత్తు, 200 కిలోల బరువైన కొప్పెరలో వెలిగించిన మోక్ష దీపం 11 రోజుల పాటు నిర్విరామంగా వెలుగులు విరజిమ్మనుంది. అరుణాచలం చుట్టుప్రక్కల సుమారు 40 కిలోమీటర్ల దూరంవరకు మహాదీపాన్ని స్పష్టంగా చూడవచ్చు.

కిటకిటలాడిన ఆలయం

మహాదీపం వెలిగించే అరుదైన ఘట్టాన్ని దర్శించేందుకు బుధవారం తెల్లవారు జాము నుండి సాయంత్రం వరకు వచ్చిన సుమారు 40 లక్షల మంది భక్తులతో అరుణాచలేశ్వర క్షేత్రం కిటకిటలాడింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తిరువణ్ణామలైకు 4 రోజుల పాటు 5,484ప్రత్యేక బస్సులు, దక్షిణ రైల్వే 14 ప్రత్యేక రైళ్లను నడిపాయి.

పోలీసు బందోబస్తు...

భక్తుల రద్దీ నేపథ్యంలో తిరువణ్ణామలైలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా 15 వేల మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు 20 ప్రత్యేక కమాండో భద్రతాదళ సిబ్బంది, 600 మందికి పైగా అగ్నిమాపక శాఖ సిబ్బంది, 2,020 మంది అటవీశాఖా సిబ్బంది కూడా విధుల్లో పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా, హిందూ దేవాదాయ శాఖ చేపట్టిన ముందు జాగ్రత్త చర్యల మేరకు మహాదీపం వెలిగించిన కొండపైకి ముందుగా అనుమతి పొందిన ఆలయ అధికారులు, సిబ్బందిని మాత్రమే అనుమతించారు.


ఆలయ ప్రాంగణంలో భరణి దీపం వెలిగిస్తున్న శివాచార్యులు

సాధువుల పాదయాత్ర..

మతసామరస్యం చాటుతూ 108 మంది సాధువులు అగ్నిక్షేత్రం తిరువణ్ణామలైలో పాదయాత్ర చేశారు. అరుణాచలేశ్వర ఆలయ రాజగోపురం నుంచి ప్రారంభించిన పాదయాత్ర గిరి ప్రదక్షిణ మార్గంలో ఉన్న ఈశాన్య లింగం వరకు 'హరోం హర', 'శివ నామస్మరణ'ల మధ్య సాగింది. రామేశ్వరం ఆత్మసిద్ధర్ లక్ష్మి దేవి, అఖండ హిందూ రాష్ట్ర తిరువణ్ణామలై జిల్లా అధ్యక్షుడు పార్తీబన్ నేతృత్వంలో సాగిన ఈ పాదయాత్రలో 108 మంది సాధువులు, శివ భక్తులు, సన్యాసులు పాల్గొన్నారు.

గొడుగులతో గిరి ప్రదక్షిణ...

దిత్వా తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో, తిరువణ్ణామలైకు వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీచేసింది. జోరువాన కూడా లెక్కచేయకుండా భక్తులు గొడుగులతో అరుణాచలేశ్వర కొండ చుట్టూ 14 కి.మీ దూరం గిరి ప్రదక్షిణ చేశారు.

అమిత్‌షాతో ఓపీఎస్ భేటీ?

- పీఎంకే, డీఎండీకేలను దరి చేర్చుకునేందుకు బీజేపీ వ్యూహం!



చెన్నై, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయినట్లు తెలిసింది. మంగళవారం సాయంత్రం కొచ్చి వెళ్లిన ఓపీఎస్.. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లి అమిత్‌షాతో రహస్యంగా సమావేశమైనట్లు సమాచారం. బీజేపీకి అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఆడిటర్ గురుమూర్తి కూడా ఈ భేటీలో పాల్గొన్నట్లు తెలిసింది. దీంతో ఓపీఎస్‌ను మళ్లీ బీజేపీ దరి చేర్చుకునేందుకు సిద్ధమైనట్లు రాజకీయవర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులైన ఓపీఎస్.. మళ్లీ ఆ పార్టీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి తరఫున స్వతంత్ర అభ్యర్థిగా రామనాథపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఓపీఎస్.. ఘోర పరాజయం చవిచూశారు. ఆ తరువాత బీజేపీ ఆయన్ని పట్టించుకోవడం మానేసింది. ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు సైతం ఓపీఎస్‌కు ముఖం చాటేశారు. ఆయన ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ లభించలేదు. దీంతో మనస్తాపం చెందిన ఓపీఎస్.. ఎన్‌డీఏ నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తరువాత ఆయన డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సన్నిహితంగా వ్యవహరిస్తుండడంతో ఆయన డీఎంకే కూటమిలో చేరే అవకాశముందని అన్ని వర్గాలు భావించాయి. ఓపీఎస్ మాత్రం విజయ్ పార్టీతో కలిసి సాగాలని ప్రయత్నాలు చేపట్టారు. కానీ అటు నుంచి కూడా స్పందన కరువవడంతో ఆయన డీలాపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయనకు హఠాత్తుగా అమిత్‌షా అపాయింట్ దొరికినట్లు తెలిసింది. దీంతో హుటాహుటిన ఢిల్లీ వెళ్లిన ఓపీఎస్.. మంగళవారం రాత్రి అమిత్‌షాతో భేటీ అయినట్లు సమాచారం. కాగా ఓపీఎస్‌ను దరి చేర్చుకునేందుకు సుముఖంగా ఉండడం వల్లనే అమిత్‌షా అపాయింట్‌మెంట్ దొరికిందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. అదే విధంగా ఓపీఎస్ బుధవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేకే నడ్డాతోనూ భేటీ అయినట్లు విశ్వసనీయ సమాచారం..

చిన్న పార్టీల వైపు కమలనాథుల చూపు...

అన్నాడీఎంకేతో కూటమి ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించి ఏడు నెలలైనా ఇప్పటి వరకూ ఇతర పార్టీలేవీ ఆ కూటమిలోకి చేరకపోవడం పట్ల బీజేపీ అగ్రనేతలు కొంత అసంతృప్తితో వున్నట్లు తెలిసింది. ఏప్రిల్‌లో చెన్నై వచ్చిన అమిత్‌షా.. అన్నాడీఎంకేతో కూటమి ప్రకటించిన విషయం తెలిసిందే. మరికొన్ని పార్టీలు కూడా తమతో కలుస్తాయని ఆయన వెల్లడించారు. కానీ ఇప్పటివరకూ అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో దివంగత విజయకాంత్ స్థాపించిన డీఎండీకే, పీఎంకే పార్టీలను తమ కూటమిలో చేర్చుకోవాలని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ బైజయంత్ పాండా గురువారం చెన్నై వస్తున్నట్లు సమాచారం. నిజానికి గత లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిలోనే పీఎంకే వుంది. ఆ తరువాత ఆ పార్టీ దూరంగా జరిగింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీని తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇప్పటికే రెండు వర్గాలుగా చీలిన ఆ పార్టీలో ఎవరితో మాట్లాడాలన్న సందిగ్ధత బీజేపీ నాయకత్వాన్ని వెంటాడుతోంది. నిజానికి ఎన్‌డీఏ కూటమిలో చేరేందుకు పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి సుముఖంగానే వున్నారు. ఆయన తండ్రి, పీఎంకే వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ మాత్రం డీఎంకే కూటమి వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా డీఎండీకే కూడా తమను కలుపుకునే పార్టీ కోసం ఎదురు చూస్తోంది. దాంతో ఆ పార్టీ అధినేత్రి ప్రేమలతతోనూ పాండా చర్చించనున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా ఓపీఎస్ తో ప్రత్యేకంగా పార్టీ పెట్టించి తమ కూటమిలో చేర్చుకోవాలని బీజేపీ నేతలు భావిస్తున్నట్లు సమాచారం. ఇక ఓపీఎస్‌కు సన్నిహితంగా వున్న అమ్మా మక్కల్ కట్చి అధినేత టీటీవీ దినకరన్‌ను కూటమిలో చేర్చుకోవడంపై బీజేపీలో చర్చ జరుగుతోంది. తమ కూటమి తరఫున ఈపీఎస్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించే ప్రసక్తే లేదని దినకరన్ ఇప్పటికే ప్రకటించారు. అలాంటి వ్యక్తిని ఎలా కూటమిలో చేర్చుకోవాలన్నదానిపై బీజేపీ మల్లగుల్లాలు పడుతోంది. అయితే వీటన్నింటికీ త్వరలోనే సమాధానం లభిస్తుందని ఆ పార్టీకి చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, డీపీఐ, ఎండీఎంకే, సీపీఐ, సీపీఎం వంటి పార్టీలతో బలంగా కనిపిస్తున్న డీఎంకే కూటమిని ఎదుర్కొనేందుకు తామూ బలమైన కూటమి ఏర్పాటు కోసం గట్టి సన్నాహాలు చేస్తున్నామని ఆ నేత వివరించారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు

30 వేల పదవులు

- సీఎం స్టాలిన్ వెల్లడి
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం


దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలను అందజేస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు 30 వేల పదవులు కేటాయించనున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వళ్లువర్‌కోట్టంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 400 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లు, వీల్ చైర్లు, ఇతర సంక్షేమ సహాయాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దివ్యాంగులకు సమాన అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. సమత్తువం, సామాజిక న్యాయం అనే అంశాలను లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో కొత్త ప్రజాప్రతినిధులుగా దివ్యాంగులు నియమితులవుతున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ సమానం, ప్రతి ఒక్కరికీ సమ హక్కు అనేదే డీఎంకే ప్రభుత్వ సిద్ధాంతమన్నారు. కలైంజర్ కరుణానిధి హయాంలోనే తొలిసారి దివ్యాంగుల కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేరని గుర్తు చేశారు. క్రీడా రంగంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి దివ్యాంగులు చరిత్ర సృష్టించబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, గీతా జీవన్, రాజకన్నప్పన్, సుబ్రమణ్యం, టీఆర్‌బీ రాజా, నగర మేయర్ ఆర్.ప్రియ, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- ఇళ్లకే పరిమితమైన నగర వాసులు
- సబ్ వేలో రాకపోకల పునరుద్ధరణ
- బలహీనపడిన వాయుగుండం
- ఏడు జిల్లాలకు వర్ష సూచన
- ఎన్నూరులో 15 సెంమీ వర్షపాతం

జల దిగ్బంధంలోనే శివారు ప్రాంతాలు


నీటమునిగిన కుమరన్ నగర్
రబ్బరు బోటులో బాధితులను తరలిస్తున్న దృశ్యం

చెన్నై, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షం కారణంగా చెన్నైతో పాటు శివారు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. కుమరన్ నగర్‌లో 15 గృహాల్లోకి వర్షపునీరు చేరింది. నగరంలోని 22 సబ్‌వేల్లో నీరు నిల్వ లేకుండా జీసీసీ ముందస్తు చర్యలు చేపట్టింది. వాయుగుండం బలహీనపడినప్పటికీ ఏడు జిల్లాలకు మాత్రం వర్ష సూచన ఉందని వాతావారణశాఖ హెచ్చరించింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా అనేక ప్రాంతాలు నీటిలో చిక్కుకున్నాయి. కాగా గురువారం చెన్నై , తిరువళ్లూరు జిల్లాల్లో పాఠశాలలకు కలెక్టర్లు సెలవు ప్రకటించారు.

మూడు రోజులుగా గృహాలకే పరిమితం

రాజధాని వాసులు మూడు రోజులుగా ఇళ్లకే పరిమితమయ్యారు. దిత్వా తుఫాన్ కారణంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో మంగళ, బుధవారాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. రహదారుల్లో వాహనాల రద్దీ తక్కువగా కనిపించింది. ఒక వైపు వర్షం, మరోవైపు చలి పెరడగంతో నగర వాసులు ఇంటికే పరిమితమయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉండే జాలర్లు కూడా గత 8 రోజులుగా చేపల వేటకు దూరంగా ఉన్నారు.

సబ్‌వేలలో వాహనాల రాకపోకలు యధాతథం

చెన్నై నగరంలో మొత్తం 22 సబ్‌వే (అండర్‌పాస్)లున్నాయి. భారీ వర్షం కురిస్తే ఈ సబ్ వేలలోకి వర్షపునీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అయితే, ఈ సారి ఆ పరిస్థితి రాకుండా, కార్పొరేషన్, అగ్నిమాపకదళం, ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఒక్క సబ్‌వేలో కూడా నీరు చేరకుండా మోటర్లతో నీటిని ఎప్పటికప్పుడు పంపింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగలదేఉ.

జోరుగా వర్షపునీరు పంపింగ్

ఉత్తర చెన్నైలో లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షపునీరు పంపింగ్ జోరుగా చేస్తున్నారు. ముఖ్యంగా వ్యాసార్‌పాడి, పులియంతోపు, ఎంకేబీ నగర్, ముల్లై నగర్, రాయపురం, కొరుకుపేట, తండయారుపేట, వాషర్‌మెన్‌పేట, ఎంకేబీ నగర్, కొడుంగయూరు తదితర ప్రాంతాల్లో కార్పొరేషన్ సిబ్బంది రేయింబవళ్ళు శ్రమిస్తూ వర్షపునీటిని పంపింగ్ చేస్తున్నారు.

ఒట్టేరిలో కూలిన ఇల్లు

ఓట్టేరి ప్రాంతంలోని స్టార్ హార్స్ సాలైలో రెండంతస్తుల భవనం మంగళవారం రాత్రి కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిని కీల్పాక్కం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే కూలిపోయిన భవనం 80 యేళ్ళనాటిదిగా స్థానికులు చెబుతున్నారు. ఈ భవన కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అలాగే, భవనానికి చెందిన ముగ్గురు యజమానులను విచారిస్తున్నారు.. ఈ నేపథ్యంలో ఈ భవనం కూలిన ప్రాంతంలో ఉన్న ఇతర భవనాలకు బుధవారం కార్పొరేషన్ అధికారులు ధృఢత్వ పరీక్షలు చేశారు.

బలహీనపడినా తప్పని వర్షాలు..

మరోవైపు బంగాళాఖాతంలో కేంద్రీకృతమైవున్న తుఫాన్ క్రమంగా బలహీపడుతోంది. అయినప్పటికీ ఏడు జిల్లాలకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక చేసింది. చెన్నై, కాంచీపురం, తిరువళ్ళూరు, చెంగల్పట్టు, రాణిపేట, నీలగిరి, కోవై జిల్లాల్లో భారీ వర్షం కురుస్తుందని తెలిపింది. కడలూరు, విల్లుపురం, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, కళ్లకుర్చి, వేలూరు, ధర్మపురి, సేలం, కన్నియాకుమారి, తెన్‌కాశి, విరుదునగర్, మదురై, నెల్లై, తూత్తుకుడి జిల్లాలకు వర్ష సూచన చేసింది.

ఎన్నూరులో 15 సెంమీ వర్షపాతం

గడిచిన 24 గంటల్లో గరిష్ఠంగా ఎన్నూరు, చెంగల్పట్టు జిల్లాలోని హిందుస్థాన్ విశ్వవిద్యాలయం ప్రాంతాల్లో 15 సెం.మీ వర్షపాతం నమోదైంది. తిరువణ్ణామలై జిల్లా సేతుపట్టిలో 13 సెం.మీ, తిరుమయం, వింకో నగర్, తిరువళ్ళూరు తామరైపాక్కంలో 12 సెం.మీ, మనలి పుదునగర్, తిరుక్కళుగుండ్రం, మేడవాక్కం, తిరువారూర్, ఇళంబూరులో 11 సెం.మీ, పళ్ళికరణి, మహాబలిపురం, వడకుత్తు, కేలంబాక్కం, రెడ్‌హిల్స్, ఉళుందూరుపేటలో 10 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

సమాచార దర్శిని

గత నెల రేషన్ సరుకుల పంపిణీ

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాల కారణంగా గత నెలలో రేషన్ దుకాణాల్లో 20 శాతం కార్డుదారులకు రేషన్ సరుకులు అందించలేదు. వారికి ఈ నెలలో రేషన్ సరుకులు ఇవ్వాలని ఆహార శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో ఒక నెల సరుకులు తీసుకోని పక్షంలో, మరుసటి నెలలో వాటిని అందించడం లేదు. అక్టోబరు చివరి వారంలో ప్రారంభమైన ఈశాన్య రుతుపవనాలు, నవంబరులో బలపడి పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో రేషన్ సరుకులు తీసుకొనేందుకు వీలు లేకుండా పోయింది. ఈ క్రమంలో, గత నెల రేషన్ సరుకులు తీసుకోని వారికి ఈ నెలలో అందించే సరుకులతో కలిపి అందించాలని ఆహార శాఖ నిర్ణయించింది.

తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా విద్యుత్ వినియోగం తగ్గింది. రాష్ట్ర రోజువారీ విద్యుత్ వినియోగం సరాసరిన 16వేల మెగావాట్లుగా ఉంది. చెన్నై, చెంగల్పట్టు సహా పలు జిల్లాల్లో గత ఆదివారం నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. చెన్నై, చుట్టుపక్కల జిల్లాలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. అలాగే, చల్లటి వాతావరణం కాగా ఇళ్ళ, గృహాల్లో విద్యుత్ సాధనాల వినియోగం తగ్గింది. ఆ ప్రకారం, మంగళవారం విద్యుత్ వినియోగం 2,000 మెగావాట్లు తగ్గి, 15వేల మెగావాట్లుగా నమోదైందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

జవహర్ నవోదయ స్కూళ్లు ప్రారంభించాలి

● బీజేపీ రాష్ట్ర నేతలు డిమాండ్

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు సూచన మేరకు రాష్ట్రంలో కూడా జవహర్ నవోదయ స్కూళ్లు ఏర్పాటు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాల్లో జవహర్ నవోదయ పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. తమిళనాడులో మాత్రం పక్కనబెట్టేశారన్నారు. ఈ పాఠశాలను తక్షణం నెలకొల్పేందుకు సీఎం స్టాలిన్ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

'కాశి తమిళ్ సంగమం'లో పాల్గొనేవారికి 'అనుభవ భాగస్వామ్యం'' పోటీలు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి 'కాశి తమిళ్ సంగమం 4.0'లో పాల్గొనే వారు తమ అనుభవాలు తెలియజేసేలా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు 'ప్రజా భవన్ (రాజ్ భవన్)' విడుదల చేసిన ప్రకటనలో... కాశి తమిళ్ సంగమం నాలుగో ఎడిషన్ వారణాసిలో మంగళవారం ప్రారంభమై ఈ నెల 15వ తేది వరకు జరగనుంది. ఈ వేడుకల్లో పాల్గొన్న వారికి 'కాశి తమిళ్ సంగమం 4.0 అనుభవ భాగస్వామ్యం' అనే పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు 'ఏ-4' కాగితంపై తమిళం, ఇంగ్లీషులో చేతితో రాయాలి. పేజీ వెనుక వైపు రాయకూడదు. కనీసం వెయ్యి పదాలు ఉండాలి. ఈ పూర్తి కాపీని జనవరి 10వ తేదిలోగా 'గవర్నర్ డిప్యూటీ సెక్రటరీ, గవర్నర్ సెక్రటరియేట్, ప్రజా భవన్, చెన్నై-600022' అనే చిరునామాకు పంపించాలి. అందులో 'కాశీ తమిళ్ సంగమం 4.0'లో పాల్గొన్న గ్రూప్ పేరు, చిరునామా, నియోజకవర్గం, కాంటాక్ట్ నెంబర్లు స్పష్టంగా పేర్కొనాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు, మీడియా సహా ఏడు విభాగాల్లో తమిళం, ఆంగ్లంలో రెండు విభాగాల్లో మూడు రచనలు ఎంపిక చేయనున్నారు. ప్రజా భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో ముగ్గురు విజేతలకు వరుసగా రూ.10,000, రూ.7,000, రూ.5,000 నగదు, సర్టిఫికెట్ అందజేయనున్నట్లు ప్రజా భవన్ తెలిపింది.

విద్యుత్ సమస్యల ఫిర్యాదుకు ప్రత్యేక నెంబరు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సాధనాల మరమ్మతులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన ప్రాంతాల్లో ప్రజలు ఫిర్యాదు చేసేలా 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. విద్యుత్ కోత, విద్యుత్ సాధనాలు దెబ్బతినడం సహా విద్యుత్ సమస్యలపై 9498794987 నెంబరుకు ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

దెబ్బతిన్న రోడ్ల ఫిర్యాదుకు 'నమ్మ సాలై' యాప్

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రహదారుల శాఖ పరిచయం చేసిన 'నమ్మ సాలై' యాప్‌లో ఇతర శాఖల రోడ్లపై కూడా ఫిర్యాదు చేసేలా ఆధునీకరించనున్నారు. రాష్ట్ర రహదారుల శాఖ పరిధిలో 66వేల కి.మీ మేర రోడ్లున్నాయి. ఈ రోడ్లపై గుంతలు ఏర్పడడం, దెబ్బతినడం తదితరాలపై ఫిర్యాదు చేసేలా రహదారుల శాఖ 'నమ్మ సాలై' యాప్ పరిచయం చేసింది. ఈ యాప్ ద్వారా తెలియజేసిన సమస్యలను 24 గంటల్లో పరిష్కరిస్తున్నారు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా కార్పొరేషన్లు, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు పర్యవేక్షిస్తున్న రోడ్లపై కూడా ఫిర్యాదు చేసేలా ఆధునీకరించనున్నారు. త్వరలో ఈ యాప్ అందుబాటులోకి రానుందని, అన్ని శాఖలు పర్యవేక్షిస్తున్న రోడ్ల సమస్యపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదుచేయవచ్చని రహదారుల శాఖ అధికారులు తెలిపారు.

కరూర్‌లో సుప్రీంకోర్టు పర్యవేక్షణ కమిటీ పర్యటన

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ సాగిస్తున్న విచారణను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన పర్యవేక్షణ కమిటీ బుధవారం విచారణ ప్రారంభించింది. ఉదయం 10 గంటలకు సుప్రీంకోర్టు పర్యవేక్షణ కమిటీలోని మాజీ న్యాయమూర్తి అజయ్ రస్తోగి నేతృత్వంలోని బృందం, తొక్కిసలాట జరిగిన వేలుచామిపురం ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ బృందం ఎస్పీ జోస్ తంగయ్యతో పాటు మృతుల కుటుంబ సభ్యుల వద్ద సుమారు 3 గంటలు విచారణ జరిపింది. విజయ్ సభకు కేటాయించాలని కోరిన లైట్ హౌస్, రైతు బజార్, మనోహర కార్నర్ ప్రాంతాలను కూడా ఈ బృందం పరిశీలించింది.

సమస్యలు పరిష్కరించాలంటూ దివ్యాంగుల భిక్షాటన



ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పలు కోర్కెలు నెరవేర్చాలని కోరుతూ దివ్యాంగులు బుధవారం భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. తంజావూరు పనగల్ ప్రభుత్వ భవనం ముందు గుమిగూడిన దివ్యాంగులు, నల్లబాడ్జీలు ధరించి, ప్ల కార్డులు పట్టుకుని భిక్షాటన చేపట్టారు. జోరువాన సైతం లెక్కచేయకుండా కళాశాల అంధ విద్యార్థుల సంక్షేమ సంఘం, పట్టభద్రుల దివ్యాంగుల సంక్షేమ సంఘం, అంధ టీచర్ల సంఘం, తమిళనాడు బ్లైండ్ వాలీబాల్ సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ధర్నాకు మోజస్ సారథ్యం వహించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీయైన ఉన్నత పోస్టులలో అర్హులైన అంధుల పట్టభద్రులను నియమించాలని ఆయన కోరారు. అనంతరం రాష్ట్ర ఆర్గనైజర్ అయ్యప్పన్ మాట్లాడుతూ... ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో, వచ్చే జనవరిలో తమకు పంపిణీ చేసిన గుర్తింపు కార్డులు తిరిగి అప్పగిస్తామని హెచ్చరించారు.

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు ఒకేరోజు పరిహారం

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల్లో చిక్కుకుని మృతిచెందిన వారి కుటుంబాలకు అందించే రూ.10 లక్షల పరిహారం ఒకే రోజు అందించేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీర్లకు విద్యుత్ బోర్డు సూచించిం ది. నగరంలో కేబుల్స్, తెగిపడిన విద్యుత్ వైర్ల నుంచి విద్యుత్ లీకేజీ కారణంగా పలువురు మృతిచెందుతున్నారు. విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.10 లక్షలు, రెండు చేతులు, కాళ్లు, కళ్లు కోల్పోతే రూ.3 లక్షలు, ఒక చేయి, కాలు, కన్ను కోల్పోతే రూ.1.50 లక్షలు పరిహారంగా అందజేస్తున్నారు. ఈ పరిహారాన్ని ఆయా జోనల్ చీఫ్ ఇంజనీర్లు అందించవచ్చు. కానీ, పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఫిర్యాదులున్నాయి. ఈ విషయమై దృష్టి సారించిన విద్యుత్ బోర్డు, విద్యుత్ ప్రమాదాల్లో మృతిచెందిన వారి కుటుంబాలకు జాప్యం లేకుండా ఒకేరోజు పరిహారం అందించాలని, గరిష్ఠంగా 48 గంటల్లో పరిహారం అందించేలా ప్రధాన ఇంజనీర్లు చర్యలు చేపట్టాలని సూచించింది.

నిధులున్నా కదలని డ్రైనేజీ పనులు

● డీఎంకే ప్రభుత్వంపై విజయ్ ధ్వజం

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిధులు సమృద్ధిగా ఉన్నా, నాలుగున్నరేళ్ల డీఎంకే ప్రభుత్వంలో డ్రైనేజీ పనులు సక్రమంగా పూర్తిచేయలేదని, అందువల్లే ప్రధాన రహదారులు సైతం చెరువులను తలపిస్తున్నాయని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ధ్వజమెత్తారు. 'దిత్వా' తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీవర్షంతో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై స్పందించిన విజయ్ బుధవారం రాష్ట్రప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు. చెన్నై సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోందని, పంటలు నీటమునిగాయని, భారీవర్షాల గురించి వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. డ్రైనేజీ కాలువ వ్యవస్థ మెరుగుకు అవసరమైన నిధులు కేటాయించినప్పటికీ, ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కడా పనులు పూర్తిచేసిన దాఖలాలు లేవని, తేలికపాటి జల్లులకే రాజధాని నగరం నీటమునుగుతోందని తెలిపారు. ఈ క్రమంలో, వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అవసరమైన సహాయాలు అందించాలని టీవీకే కార్యకర్తలకు విజయ్ పిలుపునిచ్చారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి



తిరుత్తణి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో నెమలి మృతిచెందడం స్థానికులను కంట తడిపెట్టించింది. పళ్లిపట్టు సమీపంలోని కాప్పు అటవీ ప్రాంతంలో జింకలు, నెమళ్లు సంచరిస్తుంటాయి. ఆహారం కోసం అడవి నుంచి జనావాస ప్రాంతాలకు వస్తున్న జింకలు, నెమళ్లు ప్రమాదాల్లో చిక్కుకుని మృతిచెందుతున్నాయి. ఈ క్రమంలో, నొచ్చిలి సమీపంలోని ప్రధాన రోడ్డు సమీపంలో ఆహారం కోసం ఎగురుతూ వచ్చిన నెమలి, ఆ ప్రాంతంలో విద్యుత్ వైర్లకు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందింది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెళ్లి నెమలి కళేబరం స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందింది 8 ఏళ్ల మగ నెమలి అని అధికారులు తెలిపారు. నెమలి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఖననం చేశారు.

పాఠశాల వ్యాన్... మృతులకు నివాళి



మృతులకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపంలో 2009వ సంవత్సరం జరిగిన వ్యాన్ ప్రమాదంలో మరణించిన వారి 16వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఘననివాళులర్పించారు. 2009 డిసెంబరు 3న వేదారణ్యం సమీపంలోని కార్యపట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను తీసుకువస్తున్న వ్యాన్ కత్రికుళం ప్రాంతంలో గుంతలో పడడంతో, అందులో ప్రయాణిస్తున్న నలుగురు చిన్నారులు, ఐదుగురు బాలురు, సుగంధి అనే టీచర్ సహా 9 మంది మృత్యువాతపడ్డారు. మృతుల స్మారకార్థం నగకుడయాన్ ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్థూపం వద్ద 16వ వర్ధంతిని పాటిస్తూ నివాళులర్పించారు. ఇందులో మృతుల బంధువులు, టీచర్లు, విద్యార్థులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ హుండీలో నగదు చోరీ



తిరువళ్లూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పెరియకుప్పంలోని ఆలయంలో ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీ పగులగొట్టి నగదు దోచుకెళ్లారు పెరియకుప్పం మాంగాత్తమ్మన్ ఆలయానికి తిరువళ్లూర్, కామరాజపురం, రాజాజీపురం సహా పరిసర గ్రామాల భక్తులు వస్తుంటారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హుండీలో కానుకలు వేస్తుంటారు. ఈ కానుకలను మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తుంటారు. ఈ క్రమంలో, ఆలయ పూజారి శివకుమార్ మంగళవారం రాత్రి యదావిధిగా ఆలయాన్ని మూసివేసి, బుధవారం ఉదయం 5 గంటలకు తెరిచేందుకు వచ్చారు. ఆ సమయంలో గేటు తెరచి ఉండడం గమనించి లోపలికి వెళ్లి చూడగా హుండీ బద్దలుకొట్టి ఉండడం గమనించాడు. అదే సమయంలో, అమ్మవారి ఆభరణాలు చోరీకి గురికాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. శివకుమార్ ఫిర్యాదుతో తిరువళ్లూర్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు సుమారు రూ. లక్ష నగదు వరకు చోరీ జరిగిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 10 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన బస్సులు

తిరుత్తణి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 10 మంది గాయపడ్డారు. పొదటూరుపేట నుంచి బయల్దేరిన 43ఏ సిటీ బస్సు పొదటూరుపేట నుంచి వెళ్లే సమయంలో, తిరువణ్ణామలై నుంచి పొదటూరుపేటకు వస్తున్న బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు సహా ఇద్దరు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. చుట్టుపక్కవారు క్షతగాత్రులను రక్షించి 108 అంబులెన్స్ లో పొదటూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పొదటూరుపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఫ్యాక్టరీ అధినేత ఆస్తుల స్తంభన

దగ్గు మందు వ్యవహారం...

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దగ్గు మందు తీసుకుని 20 మంది పిల్లలు మృతిచెందిన వ్యవహారంలో, ఫ్యాక్టరీ యజమాని రంగనాథన్‌కు చెందిన రూ.2.04 కోట్ల ఆస్తులను ఈడీ స్తంభింపజేసింది. మధ్యప్రదేశ్ రాష్ట్రం చింద్వారా జిల్లాలో పిల్లలు మృతిచెందారు. వారు 'కోల్డ్రిప్' దగ్గు మందు తాగి మృతిచెందారని, ఈ మందు తమిళనాడు రాష్ట్రంలో తయారవుతోందని పోలీసుల విచారణలో తెలిసింది. కాంచీపురంలో కోల్డ్రిప్ దగ్గు మందు తయారుచేసిన 'శ్రీసన్ ఫార్మా'లో తనిఖీలు చేపట్టిన అధికారులు, దాని యజమాని రంగనాథన్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం శ్రీసన్ ఫార్మా దగ్గు మందు లైసెన్స్ పూర్తిగా రద్దు చేసి, కంపెనీని మూసివేశారు. ఈ కేసులో, ఫ్యాక్టరీ యజమాని రంగనాథన్‌కు చెందిన రూ.2.04 కోట్ల ఆస్తులను ఈడీ స్తంభింజేసింది. ఆ ప్రకారం, మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద రెండు అపార్ట్‌మెంట్లు జప్తు చేసినట్లు ఈడీ ప్రకటన విడుదల చేసింది.

డీఎంకేలోకి అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే



డీఎంకే అధ్యక్షులు స్టాలిన్ సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే చిన్నస్వామి

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే చిన్నస్వామి అధికార డీఎంకేలో చేరారు. కోయంబత్తూర్ జిల్లా సింగానల్లూర్ మాజీ ఎమ్మెల్యే, అన్నా కార్మిక సంఘం మాజీ కార్యదర్శి చిన్నస్వామి తేనాంపేటలోని అన్నా అరివాలయంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు. డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ తదితరులున్నారు.

ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, 13.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. హౌరా నుంచి ఎగ్మూర్ వచ్చిన రైలు నుంచి దిగిన ప్రయాణికుల లగేజీని పోలీసులు తనిఖీ చేశారు. ఓ యువకుడి బ్యాగు తనిఖీ చేసి అందులో గంజాయి గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... అతను త్రిపుర రాష్ట్రానికి చెందిన ఫరూఖ్ హుస్సేన్ అని తెలిసింది. అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

నగదు బట్వాడా కేసు నుంచి ఎమ్మెల్యేకు విముక్తి

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓటర్లకు నగదు బట్వాడా చేసినట్లు నమోదైన కేసు నుంచి డీఎంకే ఎమ్మెల్యే మురుగేశన్‌ను మద్రాసు హైకోర్టు విముక్తి కల్పించింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరమకుడి నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీ చేసిన మురుగేశన్, ఓటర్లకు నగదు పంపిణీ చేశారనే అభియోగంపై మురుగేశన్ సహా నలుగురిపై కేసు నమోదైంది. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ మురుగేశన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. న్యాయమూర్తి జగదీష్ చంద్ర సమక్షంలో పిటిషనర్ తరఫు న్యాయవాది హాజరై, ఓటర్లకు నగదు బట్వాడా చేయడంలో మురుగేశన్‌కు ఎలాంటి సంబంధాలు లేవని, రాజకీయ దురుద్దేశంతో ఈ కేసు నమోదుచేశారని వాదించారు. ఇరుతరపు వాదనల అనంతరం, ఎమ్మెల్యే మురుగేశన్‌పై నమోదైన కేసు హైకోర్టు రద్దు చేస్తూ ఉత్తర్వులు రద్దు చేసింది.

అరటి పండు గొంతులో చిక్కుకుని బాలుడి మృతి

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరటి పండు గొంతులో చిక్కుకుని బాలుడు మృతిచెందిన ఘటన ఈరోడ్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అన్నై సత్యానగర్‌కు చెందిన మాణిక్-మహాలక్ష్మి దంపతుల కుమారుడు సాయిచరణ్ (5) మంగళవారం రాత్రి భోజనం తర్వాత అరటి పండు తింటుండగా గొంతులో చిక్కుకోవడంతో ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. దీంతో, కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఎంపీ సీవీ షణ్ముగానికి తప్పని డిజిటల్ అరెస్టు బెదిరింపులు

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తనకు ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్టు బెదిరిస్తున్నారని అన్నాడీఎంకే రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం తెలిపారు. విల్లుపురం జిల్లా దిండివనంకు చెందిన ఆయన జిల్లా అన్నాడీఎంకే కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో షణ్ముగం పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీ పార్లమెంటు భవనం సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉదయం ఆయన ఫిర్యాదు అందజేశారు. అందులో... ముంబయికి చెందిన పోలీసు శాఖ అధికారిగా చెబుతున్న వ్యక్తి, తనకు ఫోన్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నట్టు బెదిరించినట్టు తెలిపారు. ఈ బెదిరింపుపై విచారణ జరిపి తనకు భద్రత కల్పించాలని షణ్ముగం ఫిర్యాదులో తెలిపారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 9 వినతులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 9 వినతిపత్రాలు స్వీకరించారు. అలాగే వారి సమస్యలను సావధానంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను విచారించి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం జరిగే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలో విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందారు. వాడిపట్టి సమీపంలో రంజిత్ (35) టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణంలో బాలగురు (50) టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. దుకాణానికి సీరియల్ లైట్లు ఏర్పాటుచేశారు. రెండు రోజులుగా ఆ ప్రాంతంలో గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో, సీరియల్ లైటు ఒకటి పగిలి, అందులోని వైర్లు ఇనుక రాడ్‌పై పడ్డాయి. ఈ విషయం తెలియని బాలగురు బుధవారం ఉదయం ఇనుప రాడ్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన రంజిత్ అతడిని రక్షించే క్రమంలో అతను కూడా విద్యుదాఘాతానికి గురై ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న వాడిపట్టి పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యా బెదిరింపు కేసులో సీమాన్‌కు సమన్లు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హత్యా బెదిరింపు కేసులో సీమాన్‌కు సమన్లు జారీ అయ్యాయి. పుదుచ్చేరి సమీపం విల్లియనూరులో గత నెల 23వ తేది నామ్ తమిళర్ కట్చి నిర్వాహకుల సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ ఆర్గనైజర్ సీమాన్ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో, సీమాన్-విలేఖరుల మధ్య వాగ్వివాదం నెలకొంది. ఈ సమయంలో, అసభ్య మాటలతో దూషించిన సీమాన్, నిర్వాహకులు హత్య బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయమై విల్లియనూరు పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదుతో, సీమాన్, ఇద్దరు పార్టీ నేతలపై కేసు నమోదుచేశారు. ఈ కేసుకు సంబంధించి నామ్ తమిళర్ కట్చి నేతలు ముత్యాలపేటకు చెందిన సుందరపాండి, కడలూరుకు చెందిన సెల్వం తదితరులకు సమన్లు జారీ అయ్యాయి. వీరిద్దరూ మంగళవారం విల్లియనూరు పోలీసు స్టేషన్‌లో హాజరై వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో, ఈ నెల 8వ తేది విచారణకు హాజరుకావాలని సీమాన్‌కు పోలీసులు సమన్లు జారీచేశారు.

ప్రభుత్వ న్యాయవాదిపై మారణాయుధాలతో దాడి

● తెన్‌కాశిలో లాయర్ల ధర్నా

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలో బుధవారం ఉదయం ప్రభుత్వ న్యాయవాది ముత్తుకుమారస్వామిపై మారణాయుధాలతో దాడి చేసి పరారైన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. న్యాయవాదిపై దాడిచేసిన వారిని సత్వరం అరెస్ట్ చేయాలని కోరుతూ లాయర్లు ఆందోళనకు దిగారు.. తెన్‌కాశి కూల్‌కడై బజారు వీధిలోని తన కార్యాలయంలో ఉన్న ముత్తుకుమారస్వామిని ఓ ముఠా వేటకొడవళ్లు, కత్తులతో దాడిచేసి పరారైంది. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ దాడిని ఖండిస్తూ తెన్‌కాశి జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో తిరునల్వేలి-తెన్‌కాశి రహదారిలో బైఠాయించి దుండగులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ముత్తుకుమారస్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ ప్రతాప్



బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

తిరువళ్లూరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు చేపడతామని కాంట్రాక్టర్, అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ హెచ్చరించారు. తిరువళ్లూరు జిల్లా మాధవరం నియోజకవర్గం పరిధిలోని బడియనల్లూరులో బస్టాండ్ నిర్మాణ పనులను తిరువళ్లూరు మున్సిపల్ కమిషనర్ దామోదరన్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ పనులను నత్తనడకన నడుస్తున్నాయనే ఫిర్యాదులున్నాయని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ బస్టాండ్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడంతో పాటు మాధవరం, తిరువళ్లూరు బస్టాండ్‌లలో రద్దీ తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు.

విచ్చలవిడిగా మాదకద్రవ్యాల వినియోగం

● నయినార్ నాగేంద్రన్ ఆరోపణ

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీఎంకే పాలనలో రాష్ట్రంలో మాదకద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ విమర్శించారు. కళ్లకుర్చి కచ్చేరి రోడ్డులో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన ప్రచార యాత్రలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ వేదికలపై మాత్రమే భుజంపై పచ్చ కుండువా కప్పుకుని మాట్లాడుతుంటారని, వేదిక దిగాక అన్నదాతల సమస్యలు పట్టించుకోరని ఆరోపించారు. తంజావూరు పొలాల్లో దిగి నడిచివెళ్లిన స్టాలిన్, చెరకు, పసుపు తదితర పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించకుండా రైతులను మోసం చేశారని వ్యాఖ్యానించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించి అధికారం చేపడుతుందని నాగేంద్రన్ ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రదోష పూజలు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం (పక్క చిత్రంలో) శివలింగానికి అలంకరణ

తిరుత్తణి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టులోని పార్వతి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రదోష పూజలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం ఉత్సవమూర్తులకు, సాయంత్రం నంది విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు.

పెంపుడు జంతువుల లైసెన్స్‌కు గడువు పొడిగింపు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెంపుడు జంతువుల లైసెన్స్ గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటటలో వివరాలిలా ఉన్నాయి... నగరంలో పెంపుడు జంతువులకు లైసెన్స్ మంజూరు ప్రక్రియ అక్టోబరు 3 నుంచి ప్రారంభించామన్నారు. ఈ ప్రక్రియ ద్వారా పెంపుడు జంతువులకు వేసిన టీకా వివరాలు, తదుపరి టీకా వేయాల్సిన తేది వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు 91,711 పెంపుడు జంతువుల వివరాలు నమోదుచేసి, వాటిలో 45,916 జంతువులకు లైసెన్స్ మంజూరు చేశారు. ఈ లైసెన్స్‌కు గత నెల 23వ తేది వరకు కల్పించిన అవకాశాన్ని ఈ నెల 7వ తేది వరకు పొడిగించారు. జంతువుల యజమానుల కోరిక మేరకు లైసెన్స్ గడువు ఈ నెల 14వ తేది వరకు పొడిగించారు. గడువు లోపు లైసెన్స్ పొందని పెంపుడు జంతువుల యజమానులకు రూ.5,000 జరిమానా విధిస్తామని జీసీసీ హెచ్చరించింది.

గ్రూప్-4 విభాగంలో అదనంగా 645 పోస్టులు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 విభాగంలో అదనంగా 645 ఖాళీ పోస్టులు చేర్చారు. ఈ మేరకు తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) బుధవారం ప్రకటన విడుదల చేసింది. వివిధ శాఖల్లోని 3,935 గ్రూప్-4 పోస్టుల భర్తీకి ఏప్రిల్ 25వ తేది నోటిఫికేషన్ విడుదల చేశారు. సెప్టెంబరు 29న అదనంగా 727 పోస్టులు చేర్చారు. ప్రస్తుతం మరో 645 అదనపు పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకారం భర్తీ చేయనున్న గ్రూప్-4 పోస్టుల సంఖ్య 5,307కు పెరిగినట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

మైత్రీ మూవీ మేకర్స్‌కు హైకోర్టులో చుక్కెదురు

ప్రముఖ సంగీత దర్శకుడు ఇసైజ్ఞాని ఇళయరాజా స్వరపరిచిన పాటలను ఉపయోగించుకునేందుకు, రీమిక్స్ చేయకుండా విధించిన స్టేను తొలగించాలని కోరుతూ ప్రముఖ తెలుగు సినీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. అజిత్, ప్రదీప్ రంగనాథన్ హీరోలుగా మైత్రీ మూవీ మేకర్స్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ', 'డ్యూడ్' చిత్రాలను నిర్మించింది. ఇందులో ఇళయరాజా పాటలను ఉపయోగించారు. వీటిని తొలగించాలని ఇళయరాజా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఇళయరాజా పాటలను ఉపయోగించకుండా విధించిన స్టే తొలగించాలని కోరుతూ మైత్రీ మూవీ మేకర్స్ వేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఇరు వర్గాల వాదనలు ఆలకించిన హైకోర్టు మైత్రీ మూవీ మేకర్స్ పిటిషన్ కొట్టివేసింది. అలాగే, తన పాటలను అనుమతి లేకుండా ఉపయోగించేందుకు, రీమిక్స్ చేసిన వాటిని అడ్డుకునే హక్కు ఇళయరాజాకు ఉందని న్యాయమూర్తి సెంథిల్ కుమార్ తీర్పునిస్తూ, ఈ కేసు తదుపరి విచారణను జనవరి 6వ తేదీకి వాయిదా వేశారు.

అలాంటి పాత్రలు చేయాలంటే ధైర్యం ఉండాలి

చిత్రజ్యోతి

● గీతా కైలాసం



'అంగమ్మాల్'లో గీతా కైలాసం

'అంగమ్మాల్' వంటి పాత్ర చేయాలంటే నిజాయితీ, ధైర్యం కావాలని నటి గీతా కైలాసం అన్నారు. ఆమె ప్రధాన పాత్ర పోషించిన 'అంగమ్మాల్' చిత్రాన్ని ఎన్‌జాయ్ ఫిలిమ్స్, ఫిరో మూవీ స్టేషన్ పతాకంపై కార్తికేయన్, పిరోజ్ రహీం, అంజాయ్ శ్యామ్యూల్ సంయుక్తంగా నిర్మించారు. పెరుమాళ్ మురుగన్ కథ సమకూర్చగా, విపిన్ రాధాకృష్ణన్ స్క్రీన్‌ప్లే దర్శకత్వం వహించారు. ఇతర పాత్రల్లో శరణ్ శక్తి, భరణి, ముల్లైయరసి, తెండ్రల్ రఘునాథన్ తదితరులు నటించారు. ఈ 5న సినిమా విడుదల చేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం సోమవారం రాత్రి నగరంలో మీడియా సమావేశం ఏర్పాటుచేయగా, చిత్ర బృందం పాల్గొని ప్రసంగించారు. ఇందులో గీతా కైలాసం మాట్లాడుతూ, 'ఈ స్టోరీని ఎంతో సున్నితంగా తెరకెక్కించినందుకు దర్శకుడు విపిన్‌కు ధన్యవాదాలు. ఇలాంటి పాత్రలు పోషించాలంటే ధైర్యంతో పాటు నిజాయితీగా ఉండాలి. అంగమ్మాల్‌ను ప్రేరేపించిన వ్యక్తుల మధ్య నిజమైన గ్రామంలో ఈ మూవీ చిత్రీకరణ జరుపుకుంది. ఇందులో నటించిన నటీనటులకు మాత్రమే కాకుండా, ప్రేక్షకులకు కూడా ఖచ్చితంగా కొత్త అనుభవాన్ని ఇస్తుంది' అని ఆమె పేర్కొన్నారు.





చిన్మయి - పేరరసు

సిద్ధాంతం కంటే డబ్బు ముఖ్యం కాదు

● చిన్మయికి పేరరసు హితవు

సిద్ధాంతం కంటే డబ్బు ముఖ్యం కాదని ప్రముఖ గాయని చిన్మయి శ్రీపాదకు ప్రముఖ దర్శకుడు, కోలీవుడ్ దర్శకులు సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు సూచించారు. మోహన్ జీ దర్శకత్వంలో తెరకెక్కిన 'ద్రౌపది-2'లో ఓ పాటను చిన్మయి పాడారు. దీనిపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విషయాలు ముందుగా తెలిసివుంటే ఈ చిత్రంలో ఆ పాట పాడివుండేదాన్ని కాదంటూ వ్యాఖ్యానిస్తూ, దర్శకుడు మోహన్ జీపై మండిపడ్డారు. ఈ వివాదంలో దర్శకుడు పేరరసు కల్పించుకుని చిన్మయిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతరులపై విమర్శలు చేయడం మానేసి, పాట పాడేందుకు తీసుకున్న డబ్బు తిరిగిచ్చి, ఆ పాటను కూడా తొలగించమని కోరవచ్చని, సిద్ధాంతం కంటే డబ్బు ముఖ్యం కాదంటూ ఆయన హితవు పలికారు.

శ్రీకాంత్ - సృష్టి డాంగే జంటగా 'ది బెడ్'



'ది బెడ్'లో శ్రీకాంత్ - సృష్టి డాంగే

శ్రీకాంత్ (శ్రీరామ్), సృష్టి డాంగే జంటగా నటించిన చిత్రం 'ది బెడ్. ఎస్.మణిభారతి కథ సమకూర్చి దర్శకత్వం వహించారు. శ్రీనిధి ప్రొడక్షన్స్ పతాకంపై వి.విజయకుమార్ నిర్మించారు. జనవరిలో విడుదలకుసిద్ధమైన ఈ చిత్రంలో జాన్ విజయ్, బ్లాక్ పాండి, పప్పు, దేవి ప్రియ తదితరులు నటించారు. కోవై చెందిన ఆంజనేయ ప్రొడక్షన్స్ అనే సంస్థ నిర్మించింది.నీలగిరి కొండల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ విశేషాలను దర్శకుడు మణిభారతి వివరిస్తూ, 'ఇప్పటివరకు వచ్చిన చిత్రాల్లో హీరో, హీరోయిన్లు లేదా ఇతర పాత్రలతో కథ సాగుతుంది.ఈ మూవీ పూర్తి భిన్నంగా ఉం టుంది. ఇది వచ్చే యేడాది ఆరంభంలో విడుదల చేస్తున్నాం. సో... ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం నూతన సంవత్సర కానుకగా ఉంటుంది. ఊటీలో తీవ్రమైన చలి ప్రాంతంలో చిత్రీకరించిన రొమాన్స్ సన్నివేశాలు చిత్రానికి హైలెట్‌గా నిలుస్తాయి. చిత్ర నిర్మాత విజయకుమార్, హీరో శ్రీకాంత్ నాకు లభించిన గొప్ప సంపద. అలాగే చిత్రాన్ని విడుదల చేయడానికి ముందుకు వచ్చిన నిర్మాత కె.కందస్వామి, గణేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.







రైల్వే అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు

వీడని వర్షం.. పలు ప్రాంతాలు జలమయం

● ప్రభుత్వం అప్రమత్తం ● యుద్ధ ప్రాతిపదికన సహాయం



మోకాలు లోతు నీటిలో ప్రజల ఇక్కట్లు



చెరువును తలపిస్తున్న వ్యాసర్పాడి మెయిన్ రోడ్డు

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెన్నై నగరం సహా శివారు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లో నీరు చేరింది. ప్రధాన రహదారులపై వర్షపు నీరు వరదలా ప్రవహించింది. స్థానిక కుమరన్ నగర్‌లో 15 గృహాల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది. ఈ గృహాల్లో చిక్కుకున్న 25 మందిని సహాయక బృందాలు రక్షించాయి. మరోవైపు భారీ వర్షం కారణంగా నగరంలోని 22 సబ్‌వేలలో నీరు నిల్వ లేకుండా నగర పాలక సంస్థ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టింది. దీంతో సబ్‌వేలలో వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడలేదు. అదేసమయంలో ఈ వాయుగుండం బలహీనపడినప్పటికీ ఏడు జిల్లాలకు మాత్రం వర్ష సూచన ఉందని వాతావారణశాఖ హెచ్చరించింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా అనేక ప్రాంతాలు నీటిలో చిక్కుకున్నాయి ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నాయి. పుళల్ పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్, కుమరన్ నగర్, సన్ సిటీ నగర్, విలంగాడుపాక్కం పంచాయతీలో న్యూస్టార్ సిటీ, బాలాజీ గార్డెన్, తన్నిగై నగర్, వడకరై తదితర ప్రాంతాలో సుమారు రెండు వేలకుపైగా గృహాలు నీటిలో చిక్కుకున్నాయి. కుమర్ నగర్‌లో లోతట్టు ప్రాంతంలో ఉన్న 15 గృహాల్లోకి వర్షపునీరు వచ్చి చేరింది. ఈ గృహాల్లో చిక్కుకున్న 11 మంది మహిళలతో సహా మొత్తం 25 మందిని సహాయక బృందాలు పడవల ద్వారా సురక్షితంగా తీసుకొచ్చి సహాయక కేంద్రాలకు తరలించారు. తిరుమళిసైలో 600 గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నగర శివారు ప్రాంతాల్లో సుమారు మూడు వేలకు పైగా గృహాల్లోకి నీరు వచ్చి చేరింది. ఈ ప్రాంతాల్లోని వర్ష బాధితులను రక్షించేలా చర్యలు చేపట్టారు. చెన్నై నగరంలోని సబ్ వేలలోకి వర్షపునీరు నిల్వకుండా మోటార్లతో ఎప్పటికప్పుడు పంపింగ్ చేశారు. ఇదే విషయంపై చెన్నై కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వరి మాట్లాడుతూ.. చెన్నైనగరంలో వర్షపునీరు నిలబడే 170 ప్రాంతాల్లో భారీ మోటార్లను అమర్చి నీటిని పంపింగ్ చేసినట్టు తెలిపారు. అలాగే, కొంతమేరకు నీరు నిలబడిన 550 ప్రాంతాల్లో చిన్నపాటి మోటార్లతో నీటిని పంపింగ్ చేశామని వివరించారు. మరో 32 చోట్ల పెద్దపెద్ద సంప్‌లు నిర్మించి, అందులోకి వచ్చిన నీటిని పంపింగ్ చేసినట్టు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే లోతట్టు ప్రాంతాల్లో ఈ సంప్‌లను నిర్మించామన్నారు. ఈ సంప్‌ల వద్ద ఒక మోటర్ ఆపరేటర్ ఎపుడూ విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు.



మెరీనా సర్వీసు రోడ్డులో మినీ సముద్రం









అయ్యో..... మేకలు - ఇంటి ముందు నిలిచిన వర్షపు నీరు - వాననీటిలో వాహనచోదకుడి ఇక్కట్లు - నుంగంబాక్కంలో మోటారు ద్వారా నీరు తొలగింపు

స్వామిమలైలో కోలాహలంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్యారీస్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన స్వామిమలై స్వామినాథ స్వామి ఆలయంలో కార్తిక దీపోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. సుబ్రమణ్యస్వామి కొలువైన ఆరు ప్రధాన క్షేత్రాల్లో నాలుగవదైన స్వామిమలై స్వామినాథ స్వామి ఆలయంలో ప్రతి ఏటా 11 రోజులు కార్తిక దీపోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఆ క్రమంలో, ఈ ఏడాది దీపోత్సవాలు గత నెల 25న ధ్వజారోహణంతో ప్రారంభం కాగా, ఆ రోజు నుంచి ఉదయం, సాయంత్రం ఉత్సవమూర్తులు, దేవతామూర్తులను వివిధ వాహనాల్లో ఊరేగించారు.ఉత్సవాల్లో ప్రధానాంశమైన కార్తిక మహా దీప కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఉత్సవమూర్తులను అలంకరించిన రథంలో వేంచేపు చేసి ఊరేగించారు. మహా దీపం వెలిగించిన అనంతరం రాత్రి 7 గంటలకు బంగారు నెమలి వాహనంలో స్వామివారిని ఆలయ మాడవీధుల్లో నేత్రపర్వంగా ఊరేగించారు.

ఊటీలో 'వాటర్ ఏటీఎం'



క్యూ ఆర్ కోడ్‌తో ఏర్పాటైన వాటర్ ఏటీఎం

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం ఊటీలో, క్యూ ఆర్ కోడ్‌తో ఐదు ప్రాంతాల్లో కొత్త వాటర్ ఏటీఎంలు ఏర్పాటుచేశారు. నీలగిరి జిల్లాలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ బ్యాగులు సహా 21 రకాల వస్తువుల వినియోగంపై నిషేధం విధించారు. అనంతరం, జిల్లాకు వచ్చే పర్యాటకుల సౌకార్యార్థం జిల్లా వ్యాప్తంగా 45 వాటర్ ఏటీఎంలు ఏర్పాటుచేశారు. స్థానిక సంస్థల పర్యవేక్షణ లోపంతో పలు ఏటీఎంలు నిరుపయోగంగా ఉన్నాయి. అదే సమయంలో, వాటర్ ఏటీఎంలో వస్తున్న నీటి నాణ్యతపై కూడా పర్యాటకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా యంత్రాంగం, ప్రైవేటు సంస్థతో కలసి పర్యాటకులు, ప్రజలు అధికంగా చేరే ప్రాంతాల్లో వాటర్ ఏటీఎంలు ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే, బోట్ హౌస్ కాంప్లెక్స్‌లో వేడి నీటితో కూడిన కొత్త వాటర్ ఏటీఎం మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ లక్ష్మి భవ్య మీడియాతో మాట్లాడుతూ... ప్రైవేటు సంస్థతో కలసి తలా రూ.3 లక్షలతో ఐదు వాటర్ ఏటీఎంలు ఏర్పాటుచేశామన్నారు. ఈ ఏటీఎంలలో చల్లటి, వేడి నీరు వచ్చేలా ఏర్పాటుచేశామన్నారు. ఈ ఏటీఎంల పర్యవేక్షణ మహిళా స్వయం సహాయక బృందాలకు అప్పగించామని తెలిపారు. ఈ కొత్త ఏటీఎంలో క్యూ ఆర్ స్కాన్ ద్వారా అర లీటరు రూ.5, ఒక లీటరు రూ.10 ధర చెల్లించి తాగు నీటి పొందవచ్చని కలెక్టర్ తెలిపారు.

శ్రీవారి సేవలో రవి, కెనీషా



తిరుమల శ్రీవారి ఆలయం వద్ద రవి మోహన్, కెనీషా

తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): తమిళ హీరో రవి మోహన్ తన స్నేహితురాలు గాయని కెనీషాతో కలిసి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన వీరు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కి తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈసందర్భంగా వీరికి ఆలయ సిబ్బంది ప్రసాదాలు అందజేశారు. కాగా, ఆలయం ముందు కెనీషా, రవి మోహన్ తో సెల్ఫీ తీసుకునేందుకు పలువురు అభిమానులు ఎగబడ్డారు. దర్శనం అనంతరం ఆలయం ముందు రవి మోహన్ మీడియాతో మాట్లాడుతూ.. స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. 'జీనీ' అనే సినిమాతో పాటు పలు సినిమాలు ఒక్కొక్కటిగా విడుదల అవుతాయని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

వీఐటీ వర్సిటీలో రాజగోపాలాచారి స్మారక సదస్సు



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సంజయ్ కిషన్ కౌల్

వేలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలోని వీఐటీ యూనివర్శిటీలో బుధవారం న్యాయవాది రాజగోపాలాచారి స్మారక సదస్సు నిర్వహించారు. వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సంజయ్‌కిషన్ కౌల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట ముఖ్య అతిథి, వర్సిటీ నిర్వాహకులు రాజగోపాలాచారి చిత్రపటానికి నివాళులర్పించరు. ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తి మాట్లాడుతూ... దేశంలో 60 శాతం కేసులు ప్రభుత్వాలే వేస్తున్న కారణంగా పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లో 98 శాతం కేసులు పరస్పర అంగీకారంతో పూర్తిచేస్తున్నారని తెలిపారు. కానీ దేశంలో 99.9 శాతం కేసులు కోర్టు విచారణకు వెళ్తున్నాయన్నారు. న్యాయ వ్యవస్థలో మహిళలకు మంచి అవకాశాలున్నాయని, న్యాయవాదులు, న్యాయమూర్తులుగా వారు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్శిటీ ఉపాధ్యక్షులు శేఖర్, డైరెక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో కాంగ్రెస్ కమిటీ సభ్యుల భేటీ

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయగా, ఈ కమిటీ సభ్యులు బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సమావేశమయ్యారు. ముందుగా రాయపేటలోని సత్యమూర్తి భవన్‌లో వారు సమావేశమయ్యారు. ఆ తర్వాత తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయానికి వెళ్ళి సీఎంతో భేటీ అయ్యారు. ఆ సమయంలో డీఎంకే సీనియర్ నేతలు కేఎన్ నెహ్రూ, ఆర్ఎస్ భారతి, టీకేఎస్ ఇళంగోవన్ తదితరులున్నారు. కాగా, కాంగ్రెస్ కమిటీ ఏర్పాటైన తర్వాత సీఎంతో భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ కమిటీలో సెల్వపెరుంతగై, సూరజ్, ఎంఎన్ హెగ్డే, నివేదిత్ అల్వా, రాజేష్‌కుమార్‌లు సభ్యులుగా ఉన్న విషయం తెల్సిందే.



సీఎంతో కాంగ్రెస్ నేతలు

సనాతన ధర్మం నిర్మూలన పేరుతో భయాందోళనలు

● 'తమిళ కాశీ సంగమం'లో గవర్నర్ వ్యాఖ్యలు

అడయార్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామంటూ కొందరు సమాజంలోని ప్రజల మధ్య భయాందోళనలు రేకెత్తిస్తున్నారని గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారణాసిలో 'తమిళ కాశీ సంగమం' ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఓ ఆధ్యాత్మిక సదస్సులో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ.. కాశీ, తమిళనాడు రాష్ట్రాల మధ్య అనుబంధం ఈనాటిది కాదన్నారు. సుమారు వెయ్యేళ్ళ క్రితం రాజేంద్ర చోళుడు ఇక్కడకు వచ్చి పవిత్ర గంగా జలాలను తీసుకెళ్ళారన్నారు. తమిళ ప్రజల హృదయాల్లో కాశీ చిరస్థాయిగా నిలిచిపోయిందని, దీనికి శివపెరుమాళ్ నిదర్శనమన్నారు. కాలాలు మారేకొద్దీ సనాతన ధర్మాన్ని నిర్మూలిస్తామంటూ తమిళనాడు రాష్ట్రంలో కొందరు మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసి, ప్రజల మధ్య అనవసరమైన భయాందోళనలు రేకెత్తించడమే వారి ఉద్దేశమన్నారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భారతీయార్ కోసం ప్రత్యేక కుర్చీని కేంద్రం ఏర్పాటు చేసిందని, ఇలాంటి అనేక మంచి పనులు కేంద్రం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ తదితరులు పాల్గొన్నారు.